క్లుప్తంగా

'రాజీలేని సూత్రాలు' అమలు కీలకం



జిగురు పూసిన అట్టలను సిద్ధం చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రబీ వరిలో రాజీలేని సూత్రాలు అమలు కీలకమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ ధనుంజయ్ అన్నారు. జరజాం, గొలివివానిపేటల్లో రబీ వరి సాగులో రాజీలేని సూత్రాలుపై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నియంత్రణకు జిగురు పూసిన అట్టలను పొలంలో పెట్టాలని సూచించారు. పంటకు హాని చేసే పురుగులు, సుడి దోమలు అట్టలకు అంటుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీదేవి, హరేరామ్ పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో అంపోలు విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గార: ఇటీవల ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కటాస్ విభాగంలో డి.రేవంత్ బంగారు పతకాన్ని సాధించగా, కుమిటి విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించాడు. ముద్దాడ మోహన్‌దాస్ కటాస్ విభాగంలో తృతీయస్థానం, కుమిటి విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. వీరిని ప్రధానోపాధ్యాయుడు జి.దయానంద్‌కుమార్, పీడీ శ్రీనివాసరావు, వి.వి.రమణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

దివ్యాంగుడికి చేయూత



తోటయ్యకు ఆర్థిక సహాయం అందిస్తున్న వెలుగు సిబ్బంది

రణస్థలం: మండలంలోని పోతయ్యపేటకు చెందిన దివ్యాంగుడు రాయితీ తోటయ్యకు జగనన్న ప్రభుత్వం జగనన్న కాలనీ మంజూరు చేసింది. నిరుపేద కుటుంబం, భార్యా నలుగురు పిల్లలతో కుటుంబ పోషణకే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో ఇల్లు నిర్మించుకోవడం ఆర్థిక భారం కావడంతో దాతలను ఆశ్రయించాడు. మండల వెలుగు ఆఫీస్ సిబ్బంది, వీఓఏల సంఘం తరఫున రూ.8వేలను ఏపీఎం బి.వెంకటరత్నం చేతుల మీదుగా తోటయ్యకు అందజేశారు. మరువాడ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు శ్లాబ్‌కు అవసరయ్యే ఇనుము, వైఎస్సార్‌సీపీ నాయకులు జక్కంపూడి బంగార్రాజు సిమెంట్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. నారువ మాజీ సర్పంచ్ మైనర్ రాజు రూ.10వేలు అందించారు.

సర్వేతో రైతులుకు మేలు

లావేరు: సమగ్ర భూముల సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ ఎస్. దిలీప్ చక్రవర్తి అన్నారు. పోతయ్యవలసలో శనివారం సర్వేయర్లు ప్రకాష్, తేజలు రోవర్ సాయంతో భూముల సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 12 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 6 గ్రామాల్లో సర్వే జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చిలకలపల్లి దాము, వలంటీర్లు పాల్గొన్నారు.

పశువులకు వైద్యసేవలు

జి.సిగడాం: ఆనందపురం ఆర్‌బీకే పరిధిలోని అబోతులపేటలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మూగజీవులకు తనిఖీలు చేసి రైతులకు మందులు పంపిణీ చేశారు. జి.సిగడాం పశు వైద్యాధికారి ఎస్.సుమన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పైల జయరాం, వైద్యసిబ్బంది బాలిలక్ష్మినాయుడు, అనకాపల్లి జనార్దనరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చిక్కులు వీడేదెన్నడో?



రోడ్డుపై నిలిచిన ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : నగరాన్ని ట్రాఫిక్ కష్టాలు వీడటం లేదు. ముఖ్యంగా ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు ఎక్కడికక్కడ నిలిపివేస్తుండటంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రిమ్స్ ఆస్పత్రి రహదారి మధ్య ఉదయం, సాయంత్రం గంటల కొద్దీ రోడ్లపైనే బస్సులు నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆస్పత్రులు, విద్యాసంస్థలకు వెళ్లేవారితో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నీటి కొరత రానివ్వం

- వేసవి నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- విలీన పంచాయతీలపైనా దృష్టి
- 'సాక్షి'తో శ్రీకాకుళం కార్పొరేషన్ కమీషనర్ సీహెచ్ ఓబులేసు





శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని శ్రీకాకుళం నగరంలో తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు. తాగునీటి కొరత ఉందన్న ఫిర్యాదులు లేకుండా సర్వం సిద్ధం చేసినట్లు చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి'తో శనివారం ఆయన మాట్లాడారు.

తాగునీటి సమస్య ఉంటే ఎవరిని సంప్రదించాలి?

తాగునీరు, కుళాయి సమస్యలు ఉంటే కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో సచివాలయ ఎమినిటి సెక్రటరీలను సంప్రదించాలి. ప్రతి ఇంటికి ఎమినిటి సెక్రటరీల ఫోన్ నంబర్లు అతికించాం. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు?

వేసవి మొదలవ్వడంతో ఏ ఒక్కరూ తాగునీటికి ఇబ్బంది పడకుండా ఇప్పటికే నగరంలో బలగ వద్ద 40 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఇన్‌ఫిల్టర్ వాల్వ్‌ను సిద్ధం చేశాం. అక్కడ గ్యాలరీ కూడా పూర్తయ్యింది. పంపుసెట్ల పనులు ఈ నెలాఖరుకు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం

రోజుకు ఎన్ని లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు?

కార్పొరేషన్, ఏడు విలీన పంచాయతీల్లో కలిపి రోజుకు 2.30 కోట్ల లీటర్ల మంచినీటిని సరఫరా చేస్తున్నాం. తాగునీటిని ఎవరూ వృథా చేయకుండా భావితరాలకు ఇబ్బంది లేకుండా సద్వినియోగం చేసుకోవాలి.

విలీన పంచాయతీల్లో తాగునీటి ఏర్పాట్లెలా?

విలీన పంచాయతీలైన పెద్దపాడు, తోటపాలెం, సీపన్నాయుడపేట, తంగివానిపేట, ముద్దాడపేటలో ఒక్కో పంచాయతీకి ఐదు ట్రిప్పులు చొప్పున 5 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకులు వెళ్తున్నాయి. వేసవిని దృష్టిలో పెట్టుకుని అవసరాన్ని బట్టి ఎన్ని ట్యాంకులైనా పంపిస్తాం. తాగునీటి కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మోటార్ల పరిస్థితి ఎలా ఉంది?

తాగునీరందించే మోటార్లు, స్పేర్‌పార్ట్స్, పంపుసెట్లు, ప్రధాన పాయింట్లలో మోటార్లకు ఇప్పటికే మరమ్మతులు చేశాం. అత్యవసరంగా రిపేర్లు చేసేందుకు కావాల్సిన స్పేర్‌పార్ట్స్ సిద్ధంగా ఉంచాం. ఎక్కడ సమస్య తలెత్తినా సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేస్తారు.

తాగునీటి సరఫరాలో కార్పొరేషన్ ప్రత్యేకత?

రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో రెండుపూటలా కుళాయి నీరు ఇచ్చే కార్పొరేషన్‌గా శ్రీకాకుళం గుర్తింపు పొందింది. నాగావళి నదీతీరం, బలగ వద్ద నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో రెండుపూటలా నీరు ఇచ్చేందుకు సాధ్యమైంది.

నీటి వృథాను ఎలా అరికడతారు?

ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద వృథాగా నీరుపోయిన విషయం వాస్తవమే. ఇటీవల ఆంధ్రా యూనివర్సిటి ఇంజనీరింగ్ నిపుణులు వచ్చి వృథా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను గ్రౌటింగ్ చేసి ఒక్క చుక్కనీరు కూడా వృథాకాకుండా చర్యలు చేపట్టాం.

ఈసారి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారా?

గత సంవత్సరం లాగే ఈ ఏడాదీ ఎక్కువగానే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం. నగరంలోని ప్రధాన కూడళ్లలో 19 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజూ సిబ్బంది అందుబాటులో ఉంటూ తాగునీటిని అందిస్తారు.

సుధాకర్ విజయానికి కృషిచేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీగొండు రఘురామ్

గార: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీగా గెలిపిద్దామని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం శ్రీకూర్మం జంక్షన్‌లోని కల్యాణ మండపంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ మద్దతిస్తున్న అభ్యర్థికి తొలి ప్రాధాన్యత ఓటు వేసేలా గ్రామాల్లోని పట్టభద్రులతో నాయకులు మాట్లాడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును గెలిపించుకుందామన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ పీస శ్రీహరిరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, అంధవరపు బాలకృష్ణ, పీస గోపి, మార్పు పృథ్వీరాజ్, గొండు జయరామ్, సుంకాన సురేష్, ఊట అప్పలనాయుడు, జల్లు గౌరిపతినాయుడు పాల్గొన్నారు.

పట్టభద్రులకు న్యాయం చేస్తా



పట్టభద్రులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న దుప్పల రవీంద్రబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: తనను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించడంతోపాటు పట్టభద్రులకు న్యాయం జరిగేలా చూస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న దుప్పల రవీంద్రబాబు అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాల, నారాయణ నర్సింగ్ కాలేజ్ తదితర విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులను కలిశారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురం, ఎస్ఎస్ వలస, తండ్యాంవలస, నవనంబాడు, వంజంగి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థులు క్రమశిక్షణారాహిత్యంగా ఉంటే మంచిది కాదని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎల్ సన్యాసినాయుడు అన్నారు. స్థానిక టీపీఎం స్కూల్‌లో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు బాగుండాలంటే ఎనిమిది నుంచి పదో తరగతి విద్యే కీలక దశ అని, పెడదోవ పట్టకుండా చదువుపై దృష్టిపెడితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. ప్రేమ పేరుతో బాలికలను వేధించడం, చెడు వ్యసనాలకు బానిస కావడం, మత్తు పదార్థాలకు అలవాటు పడటం ఇవన్నీ భవిష్యత్తుకు ప్రశ్నార్థకంగా నిలుస్తాయన్నారు. స్మార్ట్ ఫోన్లలో చదువుకు ఉపయోగపడేవి నేర్చుకోకుండా.. అశ్లీల చిత్రాలు చూడటం, ఆన్‌లైన్‌లో విద్యార్థినులను లైంగికంగా వేధించడం వంటివి చేస్తున్నారని.. ఒక్కసారి పోలీసు రికార్డుల్లో చేరితే భవిష్యత్తు అంధకారం అవుతుందని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ ఎస్ఐ ప్రవల్లిక, ఏఎస్ఐ అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అభివృద్ధి పథంలో రాష్ట్రం



లింగాలవలసలో వైఎస్సార్, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

లావేరు: విశాఖపట్నంలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు రావడానికి కృషి చేసినందుకు శనివారం లింగాలవలసలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో సీఎం జగన్‌మోహనరెడ్డి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి జరిగిందని, మళ్లీ ఇప్పుడు సీఎం జగన్మోహనరెడ్డి పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు వట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, నాయకులు యందవ శ్రీనివాసరావు, గొర్లె సూర్యనారాయణ, మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, తరిగొప్పుల శ్రీనివాసరావు, రాంబాబు, అప్పలరాములు పాల్గొన్నారు.

ఘనంగా సింహాద్రి అప్పన్న తిరువీధి



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

లావేరు: మండలంలోని లక్ష్మీపురంలో శనివారం సింహాద్రి అప్పన్న స్వామి సంబరాల్లో భాగంగా తిరువీధి వైభవంగా జరిగింది. తొలుత స్వామివానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శనలు నడుమ తిరువీధి కొనసాగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి నేతాలమ్మ తల్లి ఉత్సవాలు



జి.సిగడాం: కోర్కెలు తీర్చే కల్పవల్లి నేతాలమ్మ తల్లి యాత్రా మహోత్సవాలు వాండ్రంగి గ్రామంలో ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 7 వరకు జరిగే ఈ ఉత్సవాలలో అమ్మవారికి ప్రతిరోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా బాలపార్వతమ్మ ఉత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో బాలపార్వతమ్మ పేరంటాలు 54 వార్షికోత్సవ ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై బాలపార్వతమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, డొంక వెంకటరమణ, చిలక సన్యాసప్పుడు, వెంకునాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


దేహధర్మాలకు సాక్షి 'ఆత్మ'

శ్రీకాకుళం కల్చరల్: దేహధర్మములకు సాక్షిగా ఆత్మ నిలుస్తుందని డాక్టర్ సనపల నారాయణ మూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో వివేకచూడామణిలో అన్నమాను కోశం అనే అంశంపైగా శనివారం ప్రసంగించారు. ప్రతిఒక్కరూ అహంకారాన్ని వీడాలన్నారు. కార్యక్రమంలో మందుల మోహనరావు, నిష్టల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్ : ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయం కావటం వల్ల ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు.కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు కూడలిలో 16వ నంబరు జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడుకుటుంబాలను గుర్తు చేసుకోవాలన్నారు.

మహిళా చైతన్యంతోనే గ్రామాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

జి.సిగడాం: మహిళలంతా చైతన్యవంతులైనప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. శనివారం జి.సిగడాం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీలరాణి అధ్యక్షతన గ్రామ సమాఖ్య అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సకాలంలో రుణాలు చెల్లించిన సభ్యులకు ప్రత్యేక రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే స్త్రీనిధి ద్వారా అర్హులైన సంఘ సభ్యులకు రుణాలు మంజూరు చేశామన్నారు. వీటి ద్వారా మహిళలకు మరింత జీవనోపాధి కలుగుతుందన్నారు. అంటురోగాలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ ఉదయ్‌కిరణ్, హరికృష్ణ ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

● సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కిరణ్



విశాఖపట్నంలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. – రణస్థలం

మీ అందరివాడిగా ఆశీర్వదించండి



రణస్థలంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును సన్మానిస్తున్న ఎంపీటీసీలు

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు

రణస్థలం/లావేరు/ఎచ్చెర్ల క్యాంపస్/జి.సిగడాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానిగా, మీ విధేయుడిగా అందరికీ అందుబాటులో ఉంటానని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీటీసీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు అమూల్యమైన ఓటును వేసి గెలిపించి జగనన్నకు కానుకగా అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు మైలపల్లి కామరాజు, మహంతి పెదరామినాయుడు, పైడి శ్రీనివాసరావు, మహంతి చినరామినాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు ఉన్నారు.

☛ లావేరు మండల పరిషత్ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఎమ్మెల్సీ నర్తు రామారావు కలిసి మద్దతు కోరారు. ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లావేరు జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీను, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

☛ ఎచ్చెర్ల మండల ప్రజాప్రతినిధులను ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు కలిశారు. ఈ నెల 13న జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జరుగుళ్ల విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, నాయకులు జరుగుళ్ల శంకరరావు, నేతింటి నీలం, అల్లు కన్నబాబు, కొమర సమరయ్య, కింతలి ఈశ్వరమ్మ, మాడుగుల జగదీశ్వరరావు పాల్గొన్నారు.

☛ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు కోరారు. జి.సిగడాంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమలో ఎంపీపీ మీసాల సత్యవతి, నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలి



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



డీఈఓకు జ్ఞాపిక అందజేస్తున్న హెచ్ఎం వాగ్దేవి

శ్రీకాకుళం న్యూకాలనీ: నిర్దేశించుకున్న లక్ష్యసాధనకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు, వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ బాలురుకు ఏమాత్రం తీసిపోని విధంగా బాలికలు నేడు అన్నింటా అగ్రస్థానంలో దూసుకుపోతున్నారని గుర్తుచేశారు. సత్ప్రవర్తన కలిగి తల్లిదండ్రులను తలెత్తుకునేలా రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, పాఠశాల హెచ్ఎం ఎం.వాగ్దేవి, విద్యావేత్త దుప్పల వెంకటరావు, విశ్రాంత హెచ్ఎం సత్యప్రభ, ఎస్.బ్రహ్మాజీ, ఆర్.లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘురామ్

గార: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ గొండు రఘురామ్ సూచించారు. శనివారం గారలోని ఎంపీపీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. సమస్య వచ్చిన వెంటనే పంచాయతీ కార్యదర్శులు వెంటనే సమాచారాన్ని పంపించాలని సూచించారు. శాలిహుండం ప్రాజెక్టుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చల్ల రామారావు, ఏఈ కింజరాపు వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసమానతలకు అద్దంపట్టేవే నాటక ప్రదర్శనలు



గోకవలస కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సమాజంలో అసమానతలకు అద్దంపట్టేవి నాటక ప్రదర్శనలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలకొండ రోడ్డులోని బాపూజీ కళా మందిర్‌లో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి మాట్లాడుతూ కళాకారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. రాజాంకు చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, ఇటీవల డాక్టరేట్ పొందిన గోకవలస కృష్ణమూర్తిని కళాకారులందరూ సత్కరించారు. అనంతరం శ్రీవాణి సంగీత విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఎం.దుర్గా నాగేశ్వర ప్రసాద్ బృందం భక్తి సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. కార్యక్రమంలో చింతాడ దిలీప్, ప్రభుత్వ ప్లీడర్ ఎం.ఎస్.వినయ భూషణరావు, సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు, గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి పన్నాల నర్సింహమూర్తి, కార్యదర్శి రామచంద్రదేవ్, ఎల్.నందికేశ్వరరావు, పైడి సత్యవతి, కె.శాంతారాం పాల్గొన్నారు.